ప్రజాశక్తి
సోమవారం 13 జనవరి, 2025
5
శ్రీకాకుళం



చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

శ్రీకాకుళం : సంక్రాంతి పండగను ఆనందంగా చేసుకోవాలని, ఎవరైనా పేకాట, కోడిపందాలు, డొక్కు ఆట వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిర్వాహకులు, అందుకు సహకరించిన వారిపైనా కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. జూదం, కోడి పందాలు, బెట్టింగ్ వంటి కార్యకలాపాలు, నిర్వాహకులపై నిఘా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అటువంటి వారు పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడి కత్తుల తయారీ, విక్రయాలు చేసిన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. కోడి పందాలు నిర్వహించిన వారిపై, పాల్గొన్న వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటువంటి సమాచారాన్ని సంబంధిత పోలీస్‌స్టేషన్ సిఐ, ఎస్‌ఐలకు, గానీ ఎస్‌పి 6309990800, స్పెషల్ బ్రాంచ్ సిఐ 6309990886, పోలీసు కంట్రోల్ రూమ్ డయల్ 100, పోలీసు వాట్సాప్ నంబరు 6309990933 తెలపాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

పల్లె గూటికి పండగ



శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం, ఆమదాలవలస

పండగ అంటే గుర్తుకొచ్చేది పల్లెటూరు. అందులోనూ సంక్రాంతి పండగ అంటే పల్లె పండగని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎక్కడెక్కడో ఉన్న జిల్లావాసులు స్వస్థలాలకు రెక్కలు కట్టుకొని వాలుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవులు కావడం, బ్యాంకులు మూతపడడంతో శ్రీకాకుళం నగరమూ బోసిపోయే అవకాశాలున్నాయి. గ్రామాలకు తరలివెళ్తున్న ప్రయాణికులతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. నిన్న, మొన్నటి వరకూ వెలవెలబోయిన పల్లె వెలుగు బస్సులు నేడు జనంతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ బస్సులను ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దూర ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్, ప్రత్యేక సర్వీసులుగా వినియోగిస్తున్నారు. ఇప్పటికే రెండు రోజులుగా జనం రద్దీతో కిటకిటలాడుతున్న ఆర్‌టిసి కాంప్లెక్స్‌లు ఆదివారం మరింత కిక్కిరిసింది. దూర ప్రాంతాలకు పల్లె వెలుగు బస్సులను నడుపుతుండడంతో గ్రామీణ ప్రాంతాల సర్వీసులకు కొంత అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయివేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించి ప్రయాణికులు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. జిల్లా అభివృద్ధికి అపారమైన వనరులు, పుష్కలమైన అవకాశాలున్నా పాలకుల నిర్లక్ష్యం వల్ల జిల్లా వెనుకబాటుకు గురైంది. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొరవడ్డాయి. అటు పారిశ్రామికంగానూ వెనుకబడింది. దీంతో జిల్లాలో ఎక్కువ మంది కూలి పనుల కోసం విశాఖ, హైదరాబాద్, చెన్నై, గుంటూరు, ప్రకాశం, విజయవాడ తదితర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. ఎక్కువగా భవన నిర్మాణం, హౌస్ కీపింగ్, దుకాణాల్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా ఏడాది పొడుగునా జరిగే కొన్ని పండగలకు వచ్చి వెళ్తుంటారు. వీరితో పాటు ఉద్యోగ, వ్యాపార రీత్యా పలు ప్రాంతాల్లో స్థిరపడిన వారూ సంక్రాంతికి వచ్చి, కుటుంబసభ్యులతో గడిపే ఆనవాయితీ ఉంది. ఇతర పండగలకు రాకపోయినా, సంక్రాంతికి తప్పక వచ్చేందుకు ఎక్కువ మంది ఇష్టపడతారు.

వీరిలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారంతా రైళ్లను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. రైల్వేస్టేషన్ల నుంచి వందలాది మంది వలస కార్మికులు దిగుతున్నారు. మరోవైపు విశాఖ నుంచి శ్రీకాకుళం, టెక్కలి, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం వంటి ముఖ్య కేంద్రాలకు వెళ్లే ఆర్‌టిసి బస్సులు ఖాళీగా ఉండడం లేదు. జిల్లా కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే పల్లె వెలుగు బస్సులూ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఇదే అదునుగా ప్రైవేటు వాహనదారులు ఇష్టానుసారంగా ఛార్జీలు పెంచుతున్నారు. మితిమీరిన వేగం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో జనం ముందుకు సాగాల్సి వస్తోంది. చిన్నపిల్లలు, వృద్ధులు, లగేజీలతో బయలుదేరిన వారి ఇబ్బందులు వర్ణనాతీతం. శ్రీకాకుళం నగరంలోని స్థానికేతరులూ తమ సొంత ఊళ్లకు బయలుదేరుతున్నారు. దీంతో ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వేస్టేషన్లు జనంతో కళకళలాడుతున్నాయి.



ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ



ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పంచాయతీల అభ్యున్నతికి కృషి

వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిధులతో నూతనంగా నాలుగు ట్రాక్టర్లు పంపిణీ చేశారు. టెక్కలి మండలం రావివలస, కోటబొమ్మాళి మండలం నిమ్మాడ, తిలారు పంచాయతీలకు మంజూరు చేశారు. వీటిని మంత్రి ఆదివారం ప్రారంభించి గ్రామాలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేశామన్నారు. ప్రధానంగా రహదారులు, డ్రైనేజీ, తాగునీరు సౌకర్యాలు కల్పించనున్నామని తెలిపారు. అనంతరం సిఎం సహాయనిధి కింద రూ.36,98,774 చెక్కులను 15 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అంతకుముందు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

పర్యాటక రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని కొత్తపేటలో రూ.నాలుగు కోట్ల ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు అనుసంధానంగా ఉండేలా రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కొత్తపేట కొండపైకి వ్యూ పాయింట్‌లా తయారు చేస్తున్నామని తెలిపారు. పర్యాటకరంగం అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, వైస్ ఎంపిపిలు టి.రామకృష్ణ, వి.విజయలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, నాయకులు వెలమల కామేశ్వరరావు, బగాది శేషు తదితరులు పాల్గొన్నారు.

యువతకు వివేకానంద స్ఫూర్తి

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


యువతకు స్వామి వివేకానంద జీవితం స్ఫూర్తి అని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. స్వామి వివేకానంద 162 వ జయంతి సందర్భంగా బెజ్జిపురం యూత్ క్లబ్, నెహ్రూ యువ కేంద్రం, సెట్‌శ్రీ సంయుక్తంగా నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో యువజనోత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న అపారమైన శక్తి దేశ సంపదని, వారిని మేల్కొల్పేందుకు ఎన్నేళ్లయినా వివేకానంద మాటలు ఉత్తేజాన్ని నింపుతాయన్నారు. దేశం యువశక్తితో నిండి ఉందని, అభివృద్ధిలో యువత భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. జిల్లాలో యువతకు నైపుణ్యంతో కూడిన ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని చెప్పారు. వికసిత భారత నిర్మాణంలో యువత పాత్ర కీలకమన్నారు. వివేకానంద ఆశయాన్ని యువత ముందుకు తీసుకెళ్లేందుకు మేల్కొనాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ వివేకానంద ప్రసంగాలు ఎప్పటికీ సజీవంగా ఉంటూ యువతలో ఉత్తేజాన్ని నింపుతాయన్నారు. అనంతరం బాలవికాస్‌తో పాటు పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నృత్య దర్శకురాలు నీరజా సుబ్రమణ్యం నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు, ఎన్‌వైకె కోఆర్డినేటర్ కె.వెంకట్ ఉజ్వల్, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, సెట్ శ్రీ సిఇఒ ప్రసాదరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద కళా జాతర

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రాజాంలో సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన జానపద కళా జాతర ఆద్యంతం ఆకట్టుకుంది. తెలంగాణ గద్దర్, వంగపండు ఉష తదితరులు జానపద గీతాలను ఆలపించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. రాజాం యువకుల జానపద నృత్యాలు, తప్పెటగుళ్ళ, అమ్మవారి పాటలు, కోలాటం, జముకుల పాటలు, బోనెల పాటలు, గంగిరెద్దులు, అంజాటలు, రేలారే రేలా వెంకటేష్ పాటలు, థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. బాతుపురం వారి జాలారి వేషం, యడ్లపల్లి చిరంజీవి పిట్టలదొర వేషం ఆకట్టుకున్నాయి. సారంగపాణి వారి గంగిరెద్దుల నృత్యాలు, అసిరయ్య బోనెల పాటలకు మంచి స్పందన లభించింది. సామాజిక గేయాలు, జానపద నృత్యాలు, పల్లె పాటలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. అనంతరం పద్మశ్రీ పురస్కార గ్రహీత, రంగస్థల నటులు ఎడ్ల గోపాలరావుతో పాటు పలువురు కళాకారులను సత్కరించారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్ష, కార్యదర్శులు దేవరాజు, రాపాక ధనరాజ్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, వైద్యులు మల్లేశ్వరరావు, కుమార్ నాయక్, మాజీ ఎంపిపి వసంతరావు, సర్పంచ్ గీతా రాణి, మాజీ సర్పంచ్ సాంబమూర్తి, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బి.గోపాల్, ఎంపిపి ప్రతినిధి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చిన కళాకారులు ఘటోత్కచుడు, హరిదాసుడు, పిట్టలదొర, కొమ్మ దాసరి, దేవర పెట్టి, ప్రాచీన కళలను వి.రాజ్ కుమార్, వై.సుబ్బారావు, వై.చిరంజీవి, కామాక్షి ప్రదర్శించారు.





పాడి పంటల చెంత ప్రగతి పరిఢవిల్లాలి

శ్రీకాకుళం: జిల్లా ప్రజానీకానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాడి పంటలు వర్ధిల్లాలని, జన జీవన సంస్కృతిలో శ్రమజీవుల కష్టం ఫలించాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఏటా మాదిరిగానే ఈ సంక్రాంతి పల్లె, పట్నంవాసుల్లో ఆనందాలను నింపాలని, సకల శుభాలు పొందాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగానికీ, కూటమి నాయకులు, ప్రజలకు శుభాకాంక్షలు చెప్తున్నానని, అంతా కలిసి రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రైతన్న సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా.. ప్రథమ ప్రాధాన్య క్రమంలో తీసుకుని పనిచేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా రైతు ఆరుగాలం శ్రమించి పండించిన పంట ధాన్యం వారు అమ్మిన ఐదు గంటల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తుంది కూటమి ప్రభుత్వమని తెలిపారు. చాలా సంతోషంగా ఉందని తెలిపారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు.

వైభవంగా రథసప్తమి వేడుకల నిర్వహణ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఫిబ్రవరి రెండు నుంచి నాలుగో తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న రథసప్తమి వేడుకలకు వచ్చే యాత్రికులకు అసౌకర్యం కలగకుండా చూడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, ఎమ్మెల్యే గొండు శంకర్, ఆలయ అధికారులతో కలిసి ఆదివారం అరసవల్లిని సందర్శించారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, దేవాదాయ శాఖలు సమన్వయంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. క్యూలైన్లతో పాటు ఎక్కడికక్కడ సదుపాయాలను కల్పించాలన్నారు. వాహనాల పార్కింగ్ మొదలు ఆలయానికి చేరుకునే వరకు అనువైన పరిస్థితులు ఉండాలన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఆర్‌జెడి సత్యనారాయణ, ఇఒ వై.భద్రాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌పి 'మీకోసం' రద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఈనెల 13న భోగి పండగ సందర్భంగా ప్రభుత్వ సెలవు రోజు కావడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, ఫిర్యాదులు చేసేందుకు వ్యయ ప్రయాసలతో జిల్లా పోలీసు కార్యాలయానికి రావద్దని కోరారు.

ఓర్వలేక విమర్శలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్


ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసిపి నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ విమర్శించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలంపాటు పనిచేసిన చంద్రబాబును అసమర్థుడని రోజా సంబోధించడం సరికాదన్నారు. జగన్ సంతృప్తి కోసం ఇష్టారాజ్యంగా ఆమె మాట్లాడుతున్నారని, తీరు మార్చుకోవాలని హితవు పలికారు. తిరుపతిలో తొక్కిసలాట దురదృష్టకరమని, అందులోనూ రాజకీయాలు చేయాలని వైసిపి ప్రయత్నాలు చేస్తోందన్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో విధ్వంసం జరిగిందని, ఇప్పుడు రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందన్నారు. ఉత్తరాంధ్ర ఆర్థిక రాజధానిగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. పలు ఐటి కంపెనీలు, రైల్వే జోన్, భోగాపురం ఎయిర్‌పోర్టు, అనకాపల్లి ప్రాంతంలో పెద్దఎత్తున పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోందన్నారు. ఉత్తరాంధ్ర యువతకు ఉపాది అవకాశాలు మెరుగుపడుతున్నాయని చెప్పారు.

ఉపాధి కల్పనే లక్ష్యం

- ఫార్మసీ అభ్యర్థులకు జెనరిక్ షాపులు
- ప్రభుత్వ రాయితీ, బ్యాంకు రుణాలు
- బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ





ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో బిసి, అగ్రవర్ణ పేద యువతకు ప్రభుత్వం పెద్దఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు వీలుగా షెడ్యూల్‌ను విడుదల చేసినట్టు బిసి కార్పొరేషన్ ఇడి ఆర్.గడ్డెమ్మ తెలిపారు. అత్యధిక బిసి జనాభా ఉన్న జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాలు, ఎంఎస్‌ఎంఇ ద్వారా జెనరిక్ ఫార్మసీ దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు వీలు కల్పించిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 21 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు ఉన్న తక్కువ ఆదాయం ఉన్న యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. ప్రభుత్వ రాయితీ పెద్ద ఎత్తున కల్పిస్తోందన్నారు. లబ్ధిదారుని వాటా కాకుండా మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణంగా అందించనున్నట్టు తెలిపారు. దీనివల్ల నిరుద్యోగ యమువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందన్నారు. గతంలో బిసిలకు మాత్రమే కార్పొరేషన్ ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేశామని, ఇప్పుడు అగ్రవర్ణ పేదలకూ ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ముఖిముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? సంక్షేమ పథకాల అమలు ఎలా ఉంది?

జిల్లాలో బిసి కార్పొరేషన్ పరిధిలో వివిధ తరగతుల వారీగా కార్పొరేషన్లు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కార్పొరేషన్ ద్వారా ఆయా సామాజిక తరగతుల వారికి ప్రయోజనం, సాధికారిత సాధించడానికి కార్పొరేషన్ పూర్తి సహాయ సహకారాన్ని అందిస్తోంది. ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యాలను ప్రభుత్వం నిర్ధేశించింది. ప్రస్తుతం బిసిల్లోని పేదలు, అగ్రవర్ణ పేదలకు ఈ పథకాలను వర్తింపజేస్తూ... నిర్ధేశించారు. పథకాలకు ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పిస్తోంది. మిగిలిన 50 శాతం బ్యాంకు రుణం అందిస్తుంది. నిరుద్యోగ యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా కార్పొరేషన్ ద్వారా సంక్షేమాన్ని అమలు చేస్తున్నాం.

? ఏయే పథకాలు అమలు అవుతున్నాయి?

జిల్లావ్యాప్తంగా అత్యధిక శాతం కుటుంబాలు బిసిగానే ఉన్నాయి. వారి కోసం ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాన్ని అమలు చేస్తోంది. బిసి స్వయం ఉపాది పథకం పేరుతో రూపొందించిన ఈ కార్యక్రమంలో మూడు శ్లాబ్‌లుగా అమలు చేస్తున్నాం. శ్లాబ్-1 కేటగిరిలో యూనిట్ విలువ రూ.లక్షల వరకు అందించేందుకు అవకాశం కల్పించారు. ఇందులో కనిష్టంగా 50 శాతం, గరిష్టంగా రూ.75 వేలు వరకు రాయితీ పొందేందుకు వీలుంది. శ్లాబ్-2లో రూ.2 నుంచి రూ.3 లక్షల లోపు యూనిట్ ధరను నిర్ణయించారు. అందులో కనిష్టం 50 శాతం, గరిష్టం రూ.1.25 లక్షల వరకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తోంది. అలాగే శ్లాబ్-3లో రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు యూనిట్ ధర నిర్ణయించారు. ఇందులో 50 శాతం కనిష్టంగా, రూ.2 లక్షలు గరిష్టంగా రాయితీ పొందవచ్చు. అలాగే బిసి అభ్యర్థులు ఫార్మసీ చదివి ఖాళీగా ఉంటే అటువంటి యువతకు జెనరిక్ మందుల దుకాణాలు కేటాయిస్తుంది. యూనిట్ విలువ రూ.8 లక్షలు కాగా, అందులో రూ.4 లక్షల రాయితీ, మరో రూ.4 లక్షల బ్యాంకు రుణం ప్రభుత్వం అందిస్తోంది.

? ఎలాంటి పథకాలు అమలు చేస్తున్నారు?

వెనుకబడిన ఇబిసి, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్య పేద కుటుంబాలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వ స్వయం ఉపాధి పథకంతో పాటు జెనరిక్ ఫార్మసీ ఏర్పాటుకు సాయం అందిస్తుంది. బిసిల మాదిరిగా వారికీ ప్రభుత్వ రాయితీ, బ్యాంకు రుణం ఇవ్వనున్నారు. వ్యాపారాభివృద్ధితో ఉపాధి పొందేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

? జిల్లాలో లక్ష్యాలు ఎంతమేరకు ఉన్నాయి?

జిల్లాలో బిసి స్వయం ఉపాధి పథకానికి శ్లాబ్-1లో 1935 యూనిట్లు, శ్లాబ్-2లో 581 యూనిట్లు, శ్లాబ్-3లో 208 యూనిట్లు లక్ష్యంగా నిర్ధేశించారు. మొత్తం 2724 యూనిట్లకు రూ.51.87 కోట్లు కేటాయించారు. జెనరిక్ ఫార్మసీ ఏర్పాటుకు 55 యూనిట్లు బిసిలకు కేటాయించారు. తద్వారా రూ.4.40 కోట్లు లక్ష్యం. అగ్రవర్ణ పేద యువతకు స్వయం ఉపాధి పథకాలు 41 యూనిట్లు నెలకొల్పడానికి రూ.71 లక్షల నిధులు మంజూరు చేశారు. పార్మసీలో 8 యూనిట్లకు రూ.64 లక్షలు మంజూరు చేశారు.

? దరఖాస్తు ఎలా చేసుకోవాలి?

ఈ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 16 చివరి తేదీగా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రేషన్ కార్డు, ఆధార్, తరగతి, ఆదాయ ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో, పట్టణ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. మండలాల వారీగా నిరుద్యోగ యువత వారి పేర్లు నమోదు చేసుకున్న తర్వాత ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తాం. సకాలంలో దరఖాస్తు చేసుకోవాలి,

యువత మార్గనిర్దేశకులుగా నిలవాలి

కాశీబుగ్గ డిఎస్‌పి వెంకట అప్పారావు



పరుగు పందెంలో పాల్గొన్న యువత

ప్రజాశక్తి- పలాస

యువత రానున్న తరాలుకు మార్గదర్శకులుగా నిలవాలని కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు పిలుపునిచ్చారు. ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యాన వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పుస్కరించుకుని ఆదివారం జిల్లాస్థాయి 5కె రన్ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిఎస్‌పి పాల్గొని మాట్లాడుతూ ఉన్నత స్థానాల్లో స్థిరపడి సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఇటువంటి వేదికలు ఏర్పాటు చేయడం జిల్లాలో కనిపిస్తుందన్నారు. అంతకుముందు గరుడభద్ర జంక్షన్ వద్ద గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. వివివి వ్యవస్థాపక అధ్యక్షులు దుమ్ము శంకరరావు, కల్నల్ మడ్డు చంద్రశేఖర్‌లు జెండా ఊపి పరుగును ప్రారంభించారు. మొదటి బహుమతిగా విజేత మెండిరాయవలసకు చెందిన బి.మోక్షకు రూ.5000 నగదు, జ్ఞాపిక, రెండో బహుమతి రాయిపాడుకు చెందిన సంతోష్ కుమార్ యాదవ్‌కు రూ.3000 నగదు, జ్ఞాపిక, మూడో బహుమతి కె.మహేష్ (లోహరిబంధ) రూ.2000 నగదు, జ్ఞాపిక, నాలుగో బహుమతి నందిగాంకు చెందిన బి.మహేష్‌కు రూ.2000 నగదు, జ్ఞాపిక, ఐదో బహుమతి రంగోయికి చెందిన డి.ప్రేమ్‌కు రూ.1000 నగదు, జ్ఞాపికను డిఎస్‌పి అందజేశారు. కార్యక్రమంలో యువివి ప్రధాన కార్యదర్శి జి.లోకేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.గీతమ్మ, గౌరవాధ్యక్షులు కుత్తుమ ప్రకాశరావు, జె.సీతారామయ్య, కె.వినోద్, బి.చిన్నారావు, కె.సుధాకర్, టి.వాసుదేవరావు, టి.ఖగేశ్వరరావు, వై.కామేశ్వరరావు, పి.బాలరాజు, నీలావతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

పారిశుధ్య కార్మికుల శ్రేయస్సే లక్ష్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పారిశుధ్య కార్మికుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు, సబ్బులు, కొబ్బరి నూనె తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. పారిశుధ్య కార్మికులు బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వార్డుల్లో పారిశుధ్యం మెరుగు పడినప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ఆ దిశగా పారిశుధ్య కార్మికులు వార్డులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేసి పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలన్నారు. పారిశుధ్య రహిత నగరంగా తీర్చిదిద్దడానికి ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతా సాగర్, శానిటేషన్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదానంపై అపోహలు తొలగాలి

ప్రజాశక్తి- కవిటి

రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగిపోవాలంటే విరివిగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఎంఇఒ ధనుంజయ్ మజ్జి, ఎస్ఐ రవివర్మ, సర్పంచ్ బెందాళం శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఉద్దానం బ్లడ్ బ్యాంకు సహకారంతో బొరివంకకు చెందిన యువత, హెల్పింగ్ హేండ్స్ సభ్యులు ఆదివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు రాజేంద్రప్రసాద్, వెంకటేష్ మాట్లాడుతూ నేటి యువత సామాజిక సేవలో ముందుందని, ముఖ్యంగా అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి రక్తం అందించే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోందని అన్నారు. ఈ శిబిరంలో 35 మంది యువకులు రక్తదానం చేసినట్టు సభ్యుడు కాశీసాహు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి డి.సతీష్, ఎంపిటిసి మాజీ సభ్యులు బెందాళం విజయ్‌కృష్ణ, బృందావన్, బల్లెడ లక్ష్మణమూర్తి, బల్లెడ జయప్రకాష్, పిరియా వేణుగోపాల్ పాల్గొన్నారు.




ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

సొండిల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- కవిటి


సొండిల సంక్షేమానికి కృషి చేస్తామని చింతామణి సొండిల సంక్షేమ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాండవ రామారావు, మొగిలిపురి నాగేశ్వరరావు తెలిపారు. చింతామణి సొండిల సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం కవిటి సమీపంలోని కొబ్బరి తోటలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా చింతామణి సొండిల సంక్షేమ సంఘం కార్యవర్గం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం తమ సంఘం తరఫున అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఆడారు.. పాడారు.. ఆత్మీయంగా గడిపారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ తమ సంఘం ద్వారా పేద విద్యార్థులకు సాయం, కెరీర్ గైడెన్స్, వివాహ పరిచయ వేదిక వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. సొండిల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి నాయకులకు సన్మానం

కోటబొమ్మాళి: వైసిపి జిల్లా ఉపాధ్యక్షునిగా అన్నెపు రామారావును, జిల్లా కార్యదర్శిగా పొన్నాన మోహనరావులు ఎంపికయ్యారు. వీరిని జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దుక్క రోజారామకృష్ణ, మండల విప్ బొడ్డు అప్పన్న, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఆదివారం సన్మానించారు. సమన్వయంతో పనిచేసి వైసిపి అభ్యర్థుల గెలుపునకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో పేడాడ వెంకటరావు, మెట్ట సింహాచలం, కాళ్ల సంజీవరావు, షేక్ రాజు, శివారెడ్డి పాల్గొన్నారు.



ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కింతలి పిఎల్ఎన్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం సందడిగా జరిగింది. ఈ సందర్భంగా సుమారు 32 ఏళ్ల తరువాత కలిసిన వారంతా ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుని, అప్పట్లో చేసిన అల్లరి చేష్టలు, ఆనంద సమయాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అలాగే వివిధ పోటీల్లో పాల్గొని సందడి చేశారు. అప్పట్లో తమకు బోధించిన ఉపాధ్యాయులు గుడ్ల పకీరు, బిఎన్ ప్రసాదరావు, బి.వెంకటనాయుడు, జి.అప్పన్న, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, కొత్తకోట లక్ష్మణరావు, పి.పాపారావులను దుశ్శాలువలు కప్పి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు.

బారువలో 5కె రన్

సోంపేట : మండలంలోని బారువ పూర్వ విద్యార్థి సంఘం 64వ వార్షికోత్సవం పురస్కరించుకొని బారువకు చెందిన ఆర్మీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన ఆదివారం జిల్లాస్థాయి 5కె రన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో రామభద్రపురానికి చెందిన యోగేష్ ప్రథమ స్థానంలోనూ, బారువకు చెందిన ఆకాశ్ ద్వితీయ స్థానంలో, కవిటికి చెందిన కె.శివ తృతీయస్థానాల్లో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలు అందజేశారు.

ఘనంగా వివేకానంద జయంతి



శ్రీకాకుళం అర్బన్ : దుస్తులు పంపిణీ చేస్తున్న డిఎస్‌పి వివేకానంద

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యువతే నవసమాజ నిర్మాతలని, దేశ భవిష్యత్ యువతపైన ఆధారపడి ఉందని డిఎస్‌పి సిహెచ్ వివేకానంద అన్నారు. ఆదివారం వివేకానంద 162వ జయంతిని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత ఆలోచనలు, నడవడికతో ముడిపడి ఉన్నాయన్నారు. అవినీతి రహిత సమాజ స్థాపన యువత చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఇందరా ప్రసాద్, శాసపు జోగినాయుడు, బి.వి రవిశంకర్, బి.దేవి ప్రసాద్, డాక్టర్ జి.నారాయణరావు, వి.జగన్నాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంక్రాంతి సందర్భంగా పేదలకు బట్టలు పంపిణీ చేశారు.

పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యాన

నగరంలోని గాంధీ మందిరంలో వివేకానందుని విగ్రహానికి పిఎంపి వైద్యుల అసోసియేషన్ అధ్యక్షులు వండాన శిమ్మన్న, కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణలు అంజలి ఘటించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జనార్ధనరావు, చిన్నాల రాములు పాల్గొన్నారు.

లావేరు: స్థానిక శాఖాగ్రంథాలయంలో వివేకానంద జయంతి సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. వివేకానంద జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు. విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార ప్రముఖ్ పొగిరి సూర్యనారాయణ, జిల్లా ధర్మప్రచార సహప్రముఖ్ బొంతు రమణ, ప్రఖండ ప్రముఖ్ కిల్లారి శేఖర్, ప్రఖండ ధర్మ రక్షక్ సాయికిరణ్, రాఘవరావు, రాఘవేంద్ర, గౌరీనాయుడు, రమేష్, తిరుమలరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యంగ్‌స్టార్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వివేకానంద విగ్రహాన్ని పునఃప్రతిష్ట చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.సత్యనారాయణ, ఎంఇఒ-2 పట్నాన రాజారావు, హెచ్ఎం పాలిశెట్టి వెంకటరావు, యంగ్‌స్టార్ యూత్‌క్లబ్ గౌరవ అధ్యక్షులు బాషా ఆనందమోహన్, అధ్యక్షులు కాళ్లకూరి శాంతారాం, సభ్యులు చంద్రశేఖర్, ఎం.తవుడు విజయకుమార్, జగన్నాదరావు, తదితరులు పాల్గొన్నారు.

కంచిలి : ప్రతిఒక్కరూ తమ భవిష్యత్‌కు, ఉద్యోగాల కోసం కాకుండా ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని ఏర్పరుచుకోవడానికి విద్య నేర్చినప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని పెద్దకొజ్జిరియాలో ఆదివారం నిర్వహించిన వివేకానంద 163వ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అంతకుముందులో నూతనంగా నిర్మించిన మినీ గోకులం, సిసి రోడ్లను ప్రారంభించారు. అనంతరం క్విజ్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, మాదిన రామారావు, బోడ్డ రాంకుమార్, టి.వి.రమణ, కురయ్యా, జగదీష్ పట్నాయక్, పి చినబాబు, హరిబాబు పాల్గొన్నారు.

సారవకోట : స్వామి వివేకానంద చెప్పిన మాట, ఆయన నడిచిన బాట మనందరికీ ఆదర్శమని, యువత ఆ దిశగా నడవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా మండలంలోని అలుదులో విజయాంభికా యువజన సంఘం ఆధ్వర్యాన వివేకానంద విగ్రహానికి పూలమాలను వేసి నివాళ్లర్పించారు. అనంతరం 250 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్, టాలెంట్ టెస్టు, వ్యాసరచన, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ధర్మాన తేజ్‌కుమార్ పాల్గొన్నారు.

పలాస : పలాసలోని వివేకానంద స్వామి విగ్రహానికి ఎమ్మెల్యే గౌతు శిరీష పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, కుత్తుం లక్ష్మణ్‌కుమార్, ఎం.నరేంద్రచిన్ని, మల్లా శ్రీనివాసరావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, బి.నాగరాజు, సాసుమాన చంద్రమౌళి పాల్గొన్నారు.

నందిగాం : నందిగామ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, గోవిందరావు, కొదండరావు, లోకనాథం పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని ప్రియాగ్రహారంలో వివేకానంద విగ్రహానికి హార్ట్ సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి బాడాన రాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. హార్ట్ సంస్థ వ్యవస్థాపకులు కొత్తూర్తి శ్రీనివాసరావు, ఐ. గణపతిరావు, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణారావు పాల్గొన్నారు.

నరసన్నపేట: స్థానిక జ్ఞానజ్యోతి స్కూలక్షలో వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా పాఠశాల నుంచి ప్రధాన రోడ్డులో ఆదివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రామారావు, సత్యం, భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కంచిలి : మాట్లాడుతున్న విప్ అశోక్



లావేరు : నివాళ్లర్పిస్తున్న గ్రంథాలయాధికారి, విద్యార్థులు

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వివేకానంద విగ్రహానికి ఎంఇఒ ధనుంజయ మజ్జి, సర్పంచ్‌లు ఎస్.పి.నారాయణస్వామి, బెందాళం శ్రీరామ్‌ప్రసాద్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం భవనం వద్ద బెందాలం చిట్టిబాబు, పాండవ శేఖర్, ఆరింగి మధు, యువజన సంఘం సభ్యులు, బొరివంకలో సర్పంచ్ శ్రీరామ్‌ప్రసాద్, ఎంపిటిసి సతీష్ పాల్గొన్నారు. బి.జి.పుట్టుగ పాఠశాల ఆవరణలో సర్పంచ్ బి.ప్రకాష్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గొనప సంతోష్, హెచ్ఎం బాబురావు వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో వివేకానంద చిత్రపటానికి ఎన్ఎస్ఎస్ పిఒ రజనీకుమారి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలో ఊడికలపాడులో వివేకానంద విగ్రహానికి సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు, ప్రతినిధి అప్పల స్వామి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సనపల కరుణ్‌కుమార్, హనుమంతు శివప్రసాద్, కుటికుప్పల సత్యానారాయణ పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక వివేకానంద విగ్రహానికి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిణితి కిరణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో రాంబాబు, శ్రీధర్, బాబూరావు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- పాతపట్నం

నియోజకవర్గ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం ఐదు మండలాల జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఒకప్పుడు 'ప్రజాశక్తి' విలేకరునని అన్నారు. విలేకరుగా జీవితాన్ని మొదలుపెట్టి ఎమ్మెల్యేగా గెలుపొందానని అన్నారు. ప్రతి విలేకరీ గ్రామాల్లో ఉండే సమస్యలను తనకు తెలియజేస్తే తనవంతు కృషి చేస్తానని అన్నారు. అలాగే ప్రతి మండలంలోనూ ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసే విధంగా రూ.ఐదు లక్షలు విరాళం ఇస్తానని ప్రకటించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరుకు కృషి చేస్తానని అన్నారు.

గ్రంథాలయ కార్యదర్శికి పురస్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రముఖ సాహితీ సంస్థ సాహితీ చైతన్య కిరణాలు ఆధ్వర్యాన వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమారరాజుకు పురస్కారం లభించింది. ఆయన రాసిన కవితకు కవి సమ్మేళనంలో ఈపురస్కారం లభించింది. కవి సమ్మేళనంలో 50 మంది కవులు తమ కవితలను వినిపించారు. ఒత్తిడి లేని చదువులు, వ్యసనాలు బారిన పడకుండా వివేకానంద బోధనలు చదవడం ఉత్తమమని ఆ కవితలో కవులు ప్రస్తావించారు. అందులో ఉత్తమ కవితగా కుమార్‌రాజు ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

బాలల శరణాలయానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి ఐసిడిఎస్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న శిశు గృహ, బాలల శరణాలయంలో పిల్లలకు ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల 1996-98 ఇంటర్మీడియట్ చదువుకున్న పూర్వ విద్యార్థులు వాషింగ్ మిషన్‌తో పాటు చదువుకోసం రూ.30 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. గడచిన 20 ఏళ్లుగా ఈబ్యాచ్ విద్యార్థులు ప్రతిఏటా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా ఈఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పూర్వ విద్యార్థులు జి.టి నాయుడు, విక్రం, సుదర్శన్ తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుదర్శన్, రామకృష్ణ, రమేష్ నాయుడు, లక్ష్మి, భారతి, బాలమణి, ఉమ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి- మందస

మండలంలోని హరిపురంలో జనసేన పార్టీ జెండాను ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ పండా ఆదివారం ఆవిష్కరించారు. ముందుగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ దుర్గారావు, నాయకులు కె.అనిల్‌కుమార్, మజ్జి భాస్కరరావు, కుప్పయ్య గోపాల్, ప్రదీప్, జీవన్‌రావు, సందీప్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కూటమి ప్రభుత్వం ట్రాన్స్ జెండర్లకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కాశీ విశ్వేశ్వర సేవా సంఘం జిల్లా ట్రాన్స్ జెండర్స్ అసోసియేషన్ ప్రతినిధి బి.హరి ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో చాలామంది ట్రాన్స్ కమ్యూనిటీలో ఉన్న వ్యక్తులు ఉన్నత చదువులు చదివి అవకాశాలు లేక భిక్షటన చేస్తున్నారని అన్నారు. కాశీ విశ్వేశ్వర సేవ సంఘం దూర విద్యా కేంద్రాల ద్వారా గుర్తింపు పొందిన కాలేజీల ద్వారా డిగ్రీ పూర్తి చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం రూ.4 వేలు పింఛను అందిస్తుందని, దీని ద్వారా ద్వారా జీవనోపాధి పొందుతున్నామని అన్నారు.

క్రీడల నిర్వహణకు పలాస తలమానికం

ప్రజాశక్తి- పలాస

క్రీడలు నిర్వాహణకు పలాస తలమానికంగా నిలుస్తుందని ఎపి ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జి బాబూరావు అన్నారు. రాష్ట్ర 41వ జూనియర్ బాల, బాలికల టెన్నీకాయిట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. అనంతరం జాతీయ అసోషియేషన్ కార్యవర్గ సభ్యులు మల్లా సంతోష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2003 నుంచి ఇక్కడి వ్యాయామ ఉపాధ్యాయుల చొరవతో ఎక్కువగా పలాసలో క్రీడా పోటీలు పలాసలో నిర్వహిస్తున్నారని అన్నారు. క్రీడల్లో రాణించిన యువతకు ఉద్యోగ అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయన్నారు. సమావేశంలో టెన్నీకాయిట్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.తవిటయ్య, మల్లా భద్రయ్య, మల్లా కామేశ్వరరావు, మల్లా కాంతారావు, టిడిపి పట్టణ అధ్యక్షులు బి.నాగరాజు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తారక్, టి.గజేంద్రరావు, సిహెచ్.పద్మలోచన, ఎస్.రామారావు, ఎస్.వి.జోగారావు, టంకాల రవిశంకర్ గుప్తా, జోగ మల్లి పాల్గొన్నారు.

విజేతలు వీరే...

పలాస జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో బాలికల విభాగంలో అనంతపురం జిల్లాకు చెందిన జి.సుప్రియ, కె.జ్యోతిక, నెల్లూరు జిల్లాకు చెందిన ఎస్.మానస, వెస్ట్రదావరికి చెందిన ఆర్.సంస్థ, ఈస్టు గోదావరి జిల్లాకు చెందిన బి.లావణ్య, చిత్తూరు జిల్లాకు చెందిన బి.గాయత్రి, బాలుర విభాగంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన బి.సిద్ధార్థ, కె.ప్రవీణ్ కుమార్, ఉ దయకిరణ్, జగదీష్ బెహరా, విజయనగరం జిల్లాకు చెందిన డి.ఉదయ్‌కిరణ్, విశాఖ జిల్లాకు చెందిన జి.అఫ్లీస్‌కుమార్‌లు విజేతలుగా నిలిచారు. వీరికి బాబూరావు బహుమతులను ప్రదానం చేశారు.



ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు



పోలాకి : ప్రచారం చేస్తున్న ఎస్ఐ రంజిత్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎచ్చెర్ల: మండలంలోని ప్రజలకు పోలీసులు అప్రమత్తం చేశారు. పండగ సందర్భంగా దొంగతనాలు జరిగే అవకాశం ఉందని, వాటిని అరికట్టాలని సిఐ అవతారం ఆదేశించారు. ఈ మేరకు ఎస్.ఐ సందీప్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం మండలంలోని బొంతలకోడూరులో ఆటో ద్వారా ప్రచారం చేశారు. పండగకు ఊర్లకు వెళ్లేవారు విలువైన వస్తువులపై జాగ్రత్తలు వహించాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పోలాకి : సంక్రాంతి పండగ సందర్భంలో దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జి.రంజిత్ సూచించారు. ఈ మేరకు ఆటోలో మైక్ ద్వారా ఆదివారం విస్తృతంగా ప్రచారం చేశారు. సంక్రాంతి పండగ సందర్భంలో ఎటువంటి కోడి పందాలు, పేకాట, గుల్లాట, బల్లాట తదితర ఆటలాడితే కఠిన చర్యలు తీసుకుంటామని మైక్ ప్రచారం ద్వారా హెచ్చరించారు.

పొందూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. గ్రామాల్లో పేకాట, పిక్కాట, కోడిపందాలు, అశ్లీల నృత్యాలు, బెల్టు షాపులు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే ఊర్లు వెళ్లేవారు తమ బంగారం, వెండి, డబ్బులు వంటి విలువైన వస్తువులను బ్యాంకుల్లోగాని, తెలిసిన వారి ఇళ్లల్లో భద్రపర్చుకోవాలని సూచించారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లులు లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ నాణ్యత గల సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒంటరిగా తిరిగే మహిళలు తమ బంగారు ఆభరణాలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

కిక్కిరిసిన మార్కెట్లు



టెక్కలి రూరల్ : రద్దీగా ఉన్న ప్రధాన రోడ్డు

ప్రజాశక్తి- పొందూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా పొందూరులో జరిగే ఆదివారం వారపు సంత నిర్వహించే మహారాజా మార్కెట్ కొనుగోలు, అమ్మకందారులతో కిక్కిరిసింది. నూతన వస్త్రాలు కొనుగోలుతో పాటు పండగకు అవసరమైన నిత్యవసర సరుకులు, కూరగాయలు, మట్టి పాత్రలతో పాలు పలు సామగ్రి కొనుగోలు సందర్భంగా జనసందోహాన్ని తలపించింది. మండలంలోని పలు గ్రామాల ప్రజలతో పాటు, సమీపంలోని జి.సిగడాం, లావేరు, సంతకవిటి మండలాల్లోని పలు గ్రామాల నుంచి ఈ సంతకు పెద్దఎత్తున ప్రజలు తరలివస్తారు. మార్కెట్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా కార్లు, ఆటోలు రాకుండా ముందుస్తుగా పోలీసులు చర్యలు చేపట్టారు.

టెక్కలి రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని టెక్కలిలో ఆదివారం జనాలతో కిక్కిరిసింది. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల ప్రజలు టెక్కలి చేరుకోవడంతో టెక్కలిలోని ప్రధాన మార్గాలు రద్దీగా మారాయి. ఆర్‌టిసి కాంప్లెక్స్, తెంబూరు రోడ్డు, ఇందిరాగాంధీ, అంబేద్కర్ కూడళ్ల వద్ద రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వివిధ రకాల వస్తువుల కొనుగోలుకు డిమాండ్ ఏర్పడింది. కూరగాయాల దగ్గర నుంచి వస్త్ర దుకాణాల వరకు కొనుగోలుదారులతో రద్దీ ఏర్పడింది. ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకున్నా అదుపు చేయడం కష్టంగా మారింది. బస్సుల్లో ప్రయాణించేవారు అవస్థలు పడ్డారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేయూత

ప్రజాశక్తి- ఆమదాలవలస

పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేయూత అందిస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని తోటాడలో నూతన విశ్రాంతి భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మండలంలోని కొత్తవలసలో ఉపాధిహామీ పథకం నిధుల నుంచి లక్షా 85 వేలతో నిర్మించిన మినీ గోకులాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమం కోసం అధిక నిధులను ఖర్చు చేస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో పాడి పరిశ్రమకు పూర్వ వైభవం వచ్చిందని రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, తమ్మినేని అమర్నాథ్, నాని, హనుమంతు బాలకృష్ణ, బెండి రాము, ఎంపిడిఒ రోణంకి వెంకటరావు, పశుసంవర్ధక శాఖ ఎడి ఆర్.ఆనందరావు, వైద్యులు హేమలత, ఎపిడి లోకేష్, ఎపిఒ సురవరపు లక్ష్మీనరసమ్మ, ఇసి రాము పాల్గొన్నారు.

బూర్జ: మండంలోని కె.కె.రాజపురం, చిన్నకురింపేట గ్రామాల్లో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ అనెపు రామకృష్ణ నాయుడు, పీరుకట్ల విశ్వ ప్రసాదరావు గోశాలలను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రాంజీ, సర్పంచ్ కొరికాన వెంకట శివ సాయి, సీతారామరాజు, ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ ఎపిఒ రవికుమార్, టిడిపి నాయకులు పీరుకట్ల సీతబాబు, పీరుకట్ల విశ్వ ప్రభాకరరావు, శ్రీరాములు నాయుడు, లంక జగన్నాథం నాయుడు, దేవాడ శ్రీనివాసరావు, పశువైద్య సిబ్బంది చల్లా లక్ష్మీనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందస : మండలంలోని హరిపురం, నారాయణపురం గ్రామాల్లో నిర్మించిన మినీ గోకులాలను, సిసి రోడ్లను ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు పొందూరు కేశవరావు సమకూర్చిన స్థానిక శాసనం వీధిలో స్వామి వివేకనంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళింగా డైరెక్టర్ భావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, ఎంపిడిఒ సూర్యనారాయణ, ఎపిఒ హరికృష్ణ, పశువైద్యాధికారి శ్రీకాంత్, ఎంపిటిసి మాజీ సభ్యులు బైరిశెట్టి గున్నయ్య పాల్గొన్నారు.



ఆమదాలవలస : మినీ గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక ఉప్పర వీధికి చెందిన కృష్ణారావు ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అదే వీధికి చెందిన ఇద్దరు వ్యక్తులు కృష్ణారావును పదే పదే సుగరు, బిపి ఉందని, నువ్వు దేనికీ పనికి రావని నలుగురులో హేళన చేసేశారు. దీంతో మనస్తాపానికి గురై స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్నారు. గ్రామస్తులు చూసి వెంటనే మంటలను అదుపు చేసి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ బి.లావణ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసుల అదుపులో కోడిపందాల రాయుళ్లు

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి- రణస్థలం

కోడి పందెం ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.32,835 నగదు స్వాధీనం చేసుకున్నట్లు జెఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు మండలంలోని చిల్లపేట రాజాం గ్రామ సమీపంలో ఆదివారం కోడి పందెం ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రాంతంలో దాడులు చేసి ఎనిమిది మంది నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.32,835 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాలుగు ద్విచక్ర వాహనాలు, ఐదు కోడి పుంజులను, ఎనిమిది సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కొత్తూరు : మండలంలోని ఇరపాడు పంచాయతీ మెట్టూరుగూడలో ఆదివారం పేకాట శిబిరం దాడులు నిర్వహించామని ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ తెలిపారు. గ్రామానికి సమీపంలో పేకాట ఆడుతున్న సమాచారం అందడంతో దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2,500 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

నాటుసారా పట్టివేత

కొత్తూరు : మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ జొన్నడుగూడలో ఆదివారం దాడులు నిర్వహించగా, వంద లీటర్ల నాటుసారాను పట్టుకున్నామని ఎస్ఐ మహమ్మద్ అమిర్ అలీ తెలిపారు. అలాగే వెయ్యి లీటర్ల ఊటలను ధ్వంసం చేశామన్నారు. ఎవరైనా నాటుసారా విక్రయించినా, తయారు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్తమ సేవకు ప్రశంస

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

శ్రీ మహాలక్ష్మి యూత్ క్లబ్ అధ్యక్షుడుగా, ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్‌గా పలు సామాజిక సేవా, విద్యా రంగంలో ముందుకు వెళ్తున్న ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు కుమారుడు తేజాకు ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో బెజ్జిపురం యూత్ క్లబ్ సౌజన్యంతో జరిగిన వేడుకల్లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతులమీదుగా ఉత్తమ సంఘ సేవకునిగా ప్రశంసా పత్రాన్ని అందించారు.

రేషన్ సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ-పలాస మున్సిపాలిటీ పరిధిలో తెలగ సంఘం ఆధ్వర్యాన ఆదివారం పేద కుటుంబాలకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. సంక్రాంతి పండగ నిర్వహించుకునేందు, పిండి వంటలు చేసుకొనేందుకు అవసరమైన నిత్యావసర వస్తువులు, దుస్తులు, నగదు పంపిణీ చేశారు. ఏటాలాగే ఈ ఏడాదీ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు రూపసుందర్, వాసు లోకు, ప్రతాప్, మన్మథరావు, భాస్కరరావు, ప్రసాద్, గోవింద్, మూర్తి, చిరంజీవి, కామేష్, బాబ్జి, ప్రకాష్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : సంక్రాంతిని పురస్కరించుకొని 'చారిటీ బాక్సు' ప్రతినిధి కిల్లంశెట్టి శ్రీదేవి మండలంలోని చాపరలో పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- సారవకోట

కూటమి ప్రభుత్వం గ్రామీణ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు నిర్మించిన బిటి రోడ్లను ఆదివారం ప్రారంభించారు. మండలంలోని జమచక్రం నుంచి బుడ్డయ్యపేట, కడిమి నుంచి సోమయ్యపేట, జలుమూరు నుంచి బుడితి, వెంకటాపురం, రామచంద్రపురం, సుబ్రమణ్యపురం బిటి రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

సిసి రోడ్లు ప్రారంభం

హిరమండలం : మండలంలోని కల్లట నుంచి జిల్లేడుపేట, యం.అవలింగి హైస్కూల్ నుంచి పాత కో-ఆపరేటివ్, కొత్తకోట నుంచి గులుమూరు వరకు ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామస్తుల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి తూలుగు తిరుపతిరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



టీ షర్ట్‌లు పంపిణీ చేస్తున్న శ్రీధర్

టీ షర్ట్‌ల పంపిణీ

పలాస : స్థానిక దువ్వాడ శ్రీధర్ స్వగృహంలో ఆదివారం క్రీడాకారులకు పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ (బాబా) టీ షర్ట్‌లు పంపిణీ చేశారు. క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో టీ షర్టులు పంపిణీ చేశామని అన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి- సోంపేట

క్రీడలు మానసికోల్లాసినికి దోహదపడతాయని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. సోంపేటలో ఆదివారం డే అండ్ నైట్ క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్నేహభావంతో క్రికెట్ పోటీలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, టిడిపి నాయకులు చిత్రాడ శ్రీను, శేఖర్, తడక జోగారావు, నగిరి శరత్‌బాబు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న విప్ అశోక్

తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిది

ప్రజాశక్తి- పొందూరు



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిదని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కింతలిలో క్రీ.శే.దుంపల వెంకట సత్యనారాయణ, లక్ష్మీకాంతం జ్ఞాపకార్థం వారి కుమారుడు విశ్రాంత ఉపన్యాసకులు దుంపల సన్యాసిరావు చేపట్టిన నిరుపేదలకు వస్త్రదానం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతికున్న తల్లిదండ్రులనే పట్టించుకోని కొడుకులున్న ప్రస్తుత సమాజంలో చనిపోయిన తల్లిదండ్రులను స్మరించుకుంటూ ఏటా నిరుపేదలకు వస్త్రదానం చేస్తున్న సన్యాసిరావు ఎందరికో ఆదర్శప్రాయులని పేర్కొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన వందలాది మంది నిరుపేదలకు ఆయన చేతులమీదుగా వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, టిడిపి బలగ శంకర భాస్కరరావు, కిల్లి రామారావు, వెంకటప్పల నాయుడు, లక్ష్మణరావు, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కమిటీకి అభినందనలు



అభినందనలు తెలుపుతున్న కిరణ్ కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

వైసిపి జిల్లా కమిటీలో వివిధ హోదాల్లో నియమితులైన వారికి ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదివారం తన కార్యాలయంలో అభినందనలు తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి జిల్లా పార్టీ కమిటీలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా సనపల నారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షులుగా బొంతు సూర్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధిగా పిల్లల శివకుమార్, సెక్రెటరీ ఆర్గనైజేషన్‌గా పాసపు రామదాసు, సెక్రటరీ ఆక్టివేట్‌గా పేడాడ శ్రీరామ్‌మూర్తిని నియమించిన సందర్భంగా వారిని దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పోరాడు తుందన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతిఒక్కరిని పార్టీ గుర్తించి ఈ విధంగానే పదవులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వైస్ ఎంపిపిలు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపిటిసులు, సర్పంచ్‌లు, మండల జెసిఎస్ కన్వీనర్లు, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- పలాస



పుస్తకాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ శాఖాగ్రంథాలయానికి ఎర్రన్న విద్యా సంకల్పం పేరుతో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సొంత నిధులతో కొనుగోలు చేసిన పోటీ పరీక్షల ఆధునిక నూతన పుస్తకాలు, బీరువా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాటిని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా వివేకానంద స్వామి, గౌతు లచ్చన్న, కింజరాపు ఎర్రన్నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే శాఖాగ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యేకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వసంత కుమార్, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.కుమార్‌రాజు, డిప్యూటీ లైబ్రరీయన్ జి.వి.వి.ఎస్.శంకరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాలరాజు, గ్రంథాలయాధికారి వై.రాంబాబు పాల్గొన్నారు.

డ్వాక్రా బజారులో ప్రత్యేక ఆకర్షణగా కొయ్యబొమ్మలు

ప్రజాశక్తి- మందస

మండలంలోని డ్వాక్రా మహిళా సంఘాలు తయారు చేసి సిక్కో డ్వాక్రా బజారులో ప్రదర్శించిన హస్తకళలు, గ్రామీణ కుటుంబ పనిముట్లు, కొయ్యబొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన డ్వాక్రా బజారులో పాల్గొని మంచి స్టాల్స్‌ను ఏర్పాటు, నిర్వహణ, సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారని అన్నారు. ఇవి విజయవంతం కావడంతో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు పి.కిరణ్‌కుమార్ చేతుల మీదగా ప్రశంసాపత్రాలు అందించారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య ప్రతినిధులు, బూర్జ మండలం పెద్దపేట ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ నూక సన్యాసిరావు, సరుబుజ్జిలి ఎపిఎం గోవిందరాజులు పాల్గొన్నారు.

ధనలక్ష్మికి సన్మానం

ఆమదాలవలస : స్వయం సహాయక సంఘ మహిళలు తయారు చేసిన వస్తు ప్రదర్శన, అమ్మకాలను ఉద్దేశించి నిర్వహించిన సిక్కోలు డ్వాక్రా బజార్ ముగింపు ఉత్సవాల్లో మండల సమాఖ్య అధ్యక్షులు, జిల్లా సమాఖ్య కార్యదర్శి తమ్మినేని ధనలక్ష్మిని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ సన్మానించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న డ్వాక్రా బజార్‌లో జిల్లా నలుమూలల నుంచి మహిళలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజారు సందర్శకులు అందరినీ ఆకర్షించింది. ఇతర జిల్లాల వారికి కూడా చక్కని సదుపాయాలతో పాటు మంచి సాంస్కృతిక కార్యక్రమాలతో సక్రమంగా నిర్వహించినందుకు సెర్ఫ్ సిబ్బందితో పాటు జిల్లా సమాఖ్య కూడా సహకారం అందించినందున ధనలక్ష్మిని దుశ్శాలువతో సత్కరించి పూల బొకేను అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, మండలాల చీఫ్ ఎగ్జిక్యూటివ్స్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మందస : ప్రశంసాపత్రం అందజేస్తున్న కూర్మారావు

తెలుగు కీర్తి కిరీటం 'ఈ-వేమన'

ప్రజాశక్తి- రణస్థలం



మహ్మద్ రఫీ (ఈవేమన)

శ్రీకాకుళం జెండాలవీధికి చెందిన రణస్థలం మండలం కొండములగాం ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ప్రసిద్ధ రచయిత, ప్రముఖ కవి, కవితామయం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీశ్రీ కళావేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మహ్మద్ రఫీ (ఈవేమన) తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్యం కోసం గత నాలుగు దశాబ్దాలుగా సాహితీ సేవ గుర్తిస్తూ తెలుగు సాహిత్యం, సామాజిక సేవ, తెలుగు భాషా, తెలుగు సంస్కృతి, తెలుగు వైభవం, కళలు రక్షణపై ఆయన చేసిన కృషికి శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ అఫ్ నేషనల్ బుక్ అఫ్ రికార్డ్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 21న విజయవాడలో కౌత పూర్ణచంద్ విలాస్ కళా వేదికలో జరిగే కార్యక్రమంలో ఈ జాతీయ పురస్కారం అందుకోనున్నారు. ఆయన ఎంపికపై హర్షం వ్యక్తం చేసిన సాహితీ సంస్థలకు, కళా సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రమాదాల నివారణపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట సిఐ మంగరాజు ఆధ్వర్యాన ఆదివారం పట్టణంలో రోడ్డు భద్రత ప్రమాదాల నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్లు ధరించండి, ప్రాణాలు కాపాడుకోండి, మీ తలే మీ రక్షణ అంటూ నినాదాలు చేశారు. ఎస్‌జిఎఫ్ ప్రతినిధులు స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక గాంధీ మండపం కూడలి వద్ద మనవహారం చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని బంటుపల్లి పంచాయతీ ప్రజలకు ప్రతి సంవత్సరం అందజేస్తున్న నూతన వస్త్రాల పంపిణీని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం పండగ సందర్భంగా సంతోషంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రజని, మాజీ సర్పంచ్ మహాలక్ష్మి, ఎన్ఇఆర్ స్కూల్ డైరెక్టర్ తేజ, హిరణ్మయి, సాయిచందు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

టెక్కలి : టెక్కలి ఆర్‌టిసి డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ... బోసు అప్పలరాజు మృతి చెందారు. ఈ మేరకు డిపో మేనేజర్ బి.ఎస్.ఎన్.మూర్తి ఎల్ఎన్‌పేట వెళ్లి అప్పలరాజు కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ఒక ప్రకటనలో సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం రూ.15 వేలు అందజేశారు. ఈయనతో పాటు డిపో సిబ్బంది గజివెల్లి నాగభూషణం తదితరులు ఉన్నారు.